నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 18, 2025 | www.navatelangana.com

నేడు ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ సమావేశం

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ ఆధ్వర్యంలో ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి పట్టభద్రుల సమావేశం మంగళవారం పెర్కగూడ జేసీస్ ఫంక్షన్ హాల్‌లో ఉంటుందని బహుజన పట్టభద్రుల వేదిక జిల్లా అధ్యక్షులు కాంబ్లె ప్రజ్ఞశీల్ తెలిపారు. సోమవారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్ విద్యా వ్యాపారస్తులకు, విద్యావేత్తకు మధ్య జరుగుతున్న పోరులో పట్టభద్రుల విద్యావేత్త ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా నిలబడాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓట్లతో బహుజన అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశానికి నిరుద్యోగ, విద్యార్థి, మేధావులు భారీ ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఫోరమ్ నార్నూర్, గాదిగూడ ఇన్‌చార్జి శశాంక్ సూర్యవంశీ, బాలరాజ్ జాదవ్, ఉట్నూర్ మండల అధ్యక్షులు నేతావత్ రవి కుమార్, బీఎస్పీ మండల వైస్ ప్రెసిడెంట్ సంతోష్ బోస్లె పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ జీఎంగా శ్రీనివాస్



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా నూతన జీఎంగా ఎం.శ్రీనివాస్‌ను నియమిస్తూ సింగరేణి ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ జీఎంగా విధులు నిర్వర్తించిన సూర్యనారాయణ డైరెక్టర్(ఆపరేషన్)గా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బెల్లంపల్లి జీఎంగా ఉన్న శ్రీనివాస్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

అక్రమ ఇసుక దందా ఆగేనా..?

- పెన్‌గంగ నుంచి యథేచ్ఛగా ఇసుక దోపిడీ
- సర్కారు సీరియస్ ఫోకస్..కదిలిన యంత్రాంగం
- వాహనాలు సీజ్ చేస్తున్నా పూర్తిగా ఆగని రవాణా
- ఎప్పటికప్పుడు దృష్టిసారిస్తేనే నివారణకు అవకాశం

తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దున ఉన్న పెన్‌గంగ నది నుంచి ఇసుక తోడేయడం సాధారణ విషయంగా మారింది. అనేక ఏండ్లుగా బహిరంగంగా సాగుతున్న ఈ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. కొన్ని చోట్ల వీడీసీలు, మరికొన్ని చోట్ల టెండర్ల ద్వారా ఇతరులకు అప్పగించి ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులు భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా నదిలో ఇసుక లేకపోవడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి కూడా భారీగా గండిపడుతోంది. భవిష్యత్తు అవసరాలకు నదులు, వాగుల్లో ఇసుక లభించని పరిస్థితి తలెత్తుతోంది. ఆదిలాబాద్ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నదులు, వాగుల నుంచి ఇసుకను తోడేస్తున్న వైనంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. అక్రమ ఇసుక రవాణాకు వెంటనే అడ్డుకట్ట వేయాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో అధికార యంత్రాంగం ఒక్కసారిగా కదిలింది. ఎక్కడికక్కడ డంపులను స్వాధీనం చేసుకోవడంతో పాటు రవాణా చేస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసు స్టేషన్లకు తరలిస్తున్నారు. కానీ కొన్ని రోజులు మాత్రమే హడావుడి చేస్తున్న అధికారులు మళ్లీ ఈ సమస్యపై దృష్టి సారించడం లేదు. దీంతో అక్రమార్కులు మళ్లీ ఇసుక రవాణాకు పాల్పడుతుండటం చర్చనీయాంశంగా మారుతోంది.



భీంపూర్ మండలంలో పెన్‌గంగ నదిలో ఇసుక తవ్వకాలు(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఇసుక అక్రమ రవాణాపై సర్కారు సీరియస్‌గా ఫోకస్ పెట్టింది. ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేసింది. ఈ బాధ్యతను ఆయా జిల్లాల ఉన్నతాధికారులే తీసుకోవాలని సూచించింది. మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇసుకను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్న దృష్ట్యా ముందస్తుగానే ఇసుక ప్రాధాన్యంపై దృష్టిసారించినట్లు తెలుస్తోంది. ఎక్కడ అక్రమ రవాణా జరగకూడదని స్పష్టం చేయడంతో జిల్లా



బేల మండలంలో తాజాగా ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసిన పోలీసులు

పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించి ఎక్కడికక్కడ తనిఖీలు చేపడుతోంది. తాజాగా రెండు రోజుల క్రితం బేల మండలంలో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించగా..మిగితా ప్రాంతాల్లో ప్రస్తుతం ఈ దందాకు బ్రేక్ పడింది. వారం రోజుల క్రితం భీంపూర్ మండలంలోని అంతర్గాంలోనూ అధికారులు ఇసుక నిల్వలను సీజ్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇన్నాండ్లు యథేచ్ఛగా తరలిపోయినా రెవెన్యూ, మైనింగ్‌శాఖలు స్పందించలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రత్యేక దృష్టిసారిస్తేనే అడ్డుకట్ట..!

ఆదిలాబాద్ జిల్లా సరిహద్దున ఉన్న పెన్‌గంగ నదిలో అక్రమ ఇసుక తవ్వకాలు ప్రతి ఏటా జరుగుతుంటాయి. బేల మండలం కాంగార్‌పూర్, సాంగిడి, జైనథ్ మండలంలోని ఆనంద్‌పూర్, సాంగ్వి, పెండల్‌వాడ, కౌట, డొల్లార ప్రాంతాలతో పాటు భీంపూర్ మండలంలోని అంతర్గాం, వడూర్, గొల్లఘాట్ తాంసి గ్రామాల నుంచి ఇసుకను వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఇందులో కొన్ని చోట్ల వీడీసీలే నిర్వహించగా.. మరికొన్ని చోట్ల టెండర్ల ద్వారా ఇతరులకు అప్పగిస్తుంటారు. ఒక్కో గ్రామంలో గుత్తేదారులు రూ.70 నుంచి రూ.80లక్షల వరకు ఖర్చు చేసి టెండర్ దక్కించుకుంటారు. నదులు, వాగుల నుంచి ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు లేకపోయినా.. ప్రతి ఏటా జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు అడ్డుకోవడం లేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అడపాదడపా తనిఖీలు నిర్వహించి వాహనాలు సీజ్ చేయడం.. మళ్లీ విడిచిపెట్టడం సాధారణ విషయంగా మారుతోంది. నదిలో ఏకంగా బోట్లను దించి భారీ యంత్రాల ద్వారా ఇసుకను బయటకు తీసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. ప్రస్తుతం అధికారులు, పోలీసుల నిఘా అధికం కావడంతో ఆయా ప్రాంతాల్లో ఉదయం పూట ఇసుక రవాణా నిలిపేస్తున్నారు. నది శివార్లలో ట్రాక్టర్లను నిలిపి రాత్రి అయ్యే వరకు వేచిచూస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రిపూట మళ్లీ బోట్లను నదిలోకి దింపి ఇసుకను తోడేస్తూ రహస్య ప్రాంతాల్లో డంపింగ్ చేస్తుంటారు. ఉదయం పూట ఎవరికి కనిపించకుండా అక్కడ్నుంచి ఇతర ప్రాంతాలకు రహస్యంగా తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు ఇసుక రవాణాపై నిశితంగా దృష్టిసారించి పూర్తిగా నివారిస్తేనే అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ లక్ష్యం కూడా నెరవేరుతుంది. భవిష్యత్తులో ప్రజా అవసరాలకు ఇసుక లభించేందుకు ఆస్కారం ఉంటుందనే వాదన వినిపిస్తోంది.

మందమర్రిలో రాష్ట్రస్థాయి యోగా పోటీలు



నవతెలంగాణ-మందమర్రి

డ్రీమ్ యోగా అండ్ ఫిట్నెస్ సొసైటీ ఆధ్వర్యంలో ఇన్విటేషన్ తెలంగాణ యోగా కప్ 2025 పోటీలను ఫిబ్రవరి 23న నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపకుడు శంకర్ తెలిపారు. సోమవారం యోగా క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటిసారిగా నాలుగు అంశాలతో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏజ్ వైస్ కాంపిటీషన్, గ్రాండ్ ఛాంపియన్షిప్, సూర్య నమస్కార పోటీలు, యోగా పుత్రిక పుత్ర అవార్డు(యోగా విన్యాస) పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ పోటీలలో రాష్ట్ర నలుమూలల నుండి సుమారు 400 మంది యోగా అభ్యాసకులు, 70 మంది యోగా గురువులు, 20 మంది న్యాయ నిర్ణీతలు పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనే వారికి ఒకరోజు ముందు నుండే వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తెలంగాణలో యోగా విద్య ఇంటింటికి వ్యాప్తి చెందాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. దాతల సహకారంతో యోగా పురస్కార వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్టు వివరించారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమై రాత్రి 7 గంటల వరకు ముగుస్తాయన్నారు. అనంతరం బహుమతి ప్రదానోత్సవం, గురుపూజోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మద్ది శంకర్, గంప అనిల్ కుమార్, దామోదర్, శ్రీనివాస్, కుమార్ లయోలా, సాంబయ్య లక్ష్మణ్, మచ్చయ్య పాల్గొన్నారు.

పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మావల, ఆదిలాబాద్ రూరల్ మండలంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో పేదలతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మావలలోని 170, ఆదిలాబాద్ రూరల్ నిషాన్ ఘాట్‌లో నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సంవత్సరాలుగా మావలలోని 170, ఆదిలాబాద్ రూరల్ నిషాన్ ఘాట్‌లో పేదల గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. ప్రతిసారి అధికారులు, మంత్రికి విన్నపాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కాలనీల్లో కనీసం తాగు నీరు, కరెంట్ సౌకర్యంతో పాటు పట్టాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నా అధికారులు మాత్రం గదులు వదిలి వచ్చి పేదల పరిస్థితులను పరిశీలించడం లేదని ఆరోపించారు. పేదల ఇబ్బందులను అర్థం చేసుకొని పట్టా, వసతులు కల్పించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుంటాల రాములు, అరుణ్, అమాన బేగం పాల్గొన్నారు.

ఎట్టకేలకు జూబ్లీ మార్కెట్‌లో చెత్త తొలగింపు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతనంగా ఏర్పడిన రాజంపేట గ్రామపంచాయతీలో చెత్త వాహనాలు లేక జూబ్లీ మార్కెట్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, కూరగాయల వ్యర్థాలను తొలగించారు. సోమవారం గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రైవేటు లేబర్‌లను ఏర్పాటు చేసి చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట గ్రామపంచాయతీకి పారిశుధ్య కార్మికులను, ట్రాక్టర్‌ను ప్రభుత్వం కేటాయించలేదని, ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కూరగాయల మార్కెట్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని, ప్రైవేటు కార్మికులతో తొలగించడం జరిగిందన్నారు. కొన్ని రోజులుగా మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు, పట్టణ ప్రజలు దుర్గంధంతో పడుతున్న ఇబ్బందులు తొలగిపోయాయి. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది సంతోష్ ఉన్నారు.

ఆశాలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల మాతా శిశు కేంద్రానికి గర్భిణులను తీసుకురావడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న ఆశా కార్యకర్తలకు అధికారులు సరిపడా ఏర్పాట్లు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. సోమవారం మాతా శిశు ఆస్పత్రిని సందర్శించి మాట్లాడారు. నిత్యం మాతా శిశు కేంద్రానికి వచ్చే ఆశాలకు కూర్చోవడానికి సరిపడా కుర్చీలు కూడా లేవన్నారు. భోజనం చేసేందుకు ప్రత్యేక గది ఏర్పాటు చేయాలన్నారు. గతంలో ఒక గది కేటాయించినప్పటికీ అది ఇప్పటికీ తెరుచుకోలేదని, దాన్ని ఆశా కార్యకర్తలకు అందించి ప్రత్యేక మూత్రశాల, సరిపడా సౌకర్యాలు కల్పించాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదల్లో ముగ్గురు మృతి

నవతెలంగాణ-సారంగాపూర్, లక్షెట్టిపేట





నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం చించోలి(బి) సమీపంలో ద్విచక్ర వాహనం చెట్టును ఢీ కొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ధని గ్రామానికి చెందిన మెంగ సాయన్న(50), అయిటి మహేందర్(45) ఇద్దరు పని నిమిత్తం నిర్మల్‌కు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా చించోలి(బి) గ్రామ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీ కొట్టారు. సాయన్న అక్కడికక్కడే మృతి చెందగా, మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు నిర్మల్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నారు.



లక్షెట్టిపేట : మృతి చెందిన శేఖర్

లక్షెట్టిపేటలో..

మండలంలోని వెంకట్రావుపేట ఎక్స్ రోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడి నూర శేఖర్(32) మృతి చెందినట్లు ఎస్ఐ పి.సతీష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన శేఖర్ ఆదివారం కడెం మండలంలో బంధువు అంత్యక్రియలకు హాజరై తిరిగి మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. వెంకట్రావుపేట ఎక్స్ రోడ్డు వద్ద అడవి పంది అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి రోడ్డుపై పడిపోయాడు. తలకు గాయమైంది. స్థానికులు గమనించి 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. మంచిర్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగుల ఉపకరణాల పంపిణీకి చర్యలు

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లాలోని దివ్యాంగులకు ఉపయోగపడే విధంగా జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, అలింకో సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సహాయ ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు అర్హులైన వారిని ఎంపిక చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి రవూఫ్ ఖాన్, అలింకో సంస్థ నిర్వాహకులు, వైద్యులు డా. సునీత సుభాదర్శిని దాస్‌లతో కలిసి 4 రకాల వైకల్యాలు కలిగిన దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు పంపిణీ చేసేందుకు అర్హుల ఎంపిక కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగ శాతం, అర్హతను బట్టి దివ్యాంగులకు అవసరమైన సహాయ ఉపకరణాలు అందిస్తామన్నారు. దివ్యాంగులు ఈ కార్యక్రమానికి హాజరై వారి వివరాలు నమోదు చేసుకున్నారని, ఎంపిక ప్రక్రియ పూర్తి అయిన తరువాత అలింకో సంస్థ ద్వారా వారికి కావలసిన ఉపకరణములు త్వరలోనే అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ శిబిరంలో దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భోజనం, మజ్జిగతో పాటు తాగునీరు, హెల్ప్ డెస్క్ , రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నెల 18న చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్, బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట, నెన్నెల, భీమిని, కన్నెపల్లి, మందమర్రి రూరల్/అర్బన్ ప్రాంతాల వారికి, 19న బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలి భవన్ సమీపంలో గల సింగరేణి కళావేదిక, లక్షెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల వారికి, 20న లక్షెట్టిపేట మండల కేంద్రంలోని రైతు వేదిక (వ్యవసాయ మార్కెట్ యార్డు)లో నిర్వహించడం జరుగుతుందన్నారు. శారీరక దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిల్, మూడు చక్రాల రిక్షా, వీల్ చైర్, చంక కర్రలు, చేతి కర్రలు, మూగ, చెవిటి వారికి శ్రవణ యంత్రాలు, అంధులకు ప్రత్యేక మొబైల్ ఫోన్లు, చేతి కర్రలు, మానసిక దివ్యాంగులకు ప్రత్యేక కిట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. నిర్ణీత తేదీలలో ఉదయం 9 గం.ఎల నుండి సాయంత్రం 5గంటల వరకు శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ మంచిర్యాల ప్రాజెక్టు సిడిపిఓ విజయలక్ష్మి, సూపర్వైజర్స్, అలింకో సంస్థ ప్రతినిధులు, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి ఎండి. ఫర్జానా బేగం, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆనంద్, సఖి సిబ్బంది, డిహెచ్ఈడబ్ల్యు, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధే ప్రథమ కర్తవ్యంగా భావించాలి



హైపూర్: సింగరేణి కాలరీస్ సుస్థిర భవిష్యత్తే ప్రతి ఒక్క అధికారి, ఉద్యోగికి ప్రథమ కర్తవ్యం కావాలని, ఇందుకోసం అందరూ తమకు కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సీఎండీ ఎన్.బలరామ్ స్పష్టం చేశారు. సింగరేణి అధికారులతో సోమవారం సింగరేణి భవన్ నుండి ముఖాముఖిలో మాట్లాడారు. పోటీ మార్కెట్లో నిలదొక్కుకోవడానికి వీలుగా సంస్థ భవిష్యత్ కోసం వచ్చే పదేళ్లకు అవసరమైన ప్రణాళికలను ప్రతి విభాగం అధిపతులు సిద్ధం చేయాలని ఆదేశించారు. సింగరేణిలో పని చేస్తున్న అందరూ కంపెనీ అభివృద్ధికి మొదటి ప్రాధాన్యత నివ్వాలని తెలిపారు. ఆయా ఏరియాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలు, ఇప్పటి వరకు సాధించిన పురోగతిని తెలుసుకొని రానున్న 43 రోజుల్లో మిగిలిన లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా సాధించాలని ఆదేశించారు. రోజుకు 2.6 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరగాలన్నారు. అలాగే 17 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలని స్పష్టం చేశారు. బొగ్గు ఉత్పత్తిలో రక్షణ, నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, అదే సమయంలో రవాణా విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బొగ్గు రవాణా సాఫీగా జరిగేలా రైల్వే వినియోగదారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ ఉండాలన్నారు. నూతన గనుల విషయంలో అపరిష్కృతంగా ఉన్న భూ సేకరణ, పర్యావరణ అనుమతులపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ జీఎంలకు ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల బెల్లంపల్లి, రామగుండం రీజియన్లలోని 20 గనుల్లో చేపట్టిన పర్యటనలో కార్మికుల నుంచి తెలుసుకున్న సమస్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ, నాణ్యత పెంపుదలతోపాటు భూగర్భ గనులకు సంబంధించి టబ్బులను అందుబాటులో ఉంచేలా చూడటం, ప్రాసెస్డ్ ఓవర్ బర్డెన్ నిల్వలను ఉంచుకోవడం, మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, గైర్హాజరీలను నివారించేలా కౌన్సెలింగ్ నిర్వహించడం తదితర అన్ని చర్యలను చేపట్టడం ద్వారా ఉత్పత్తికి దోహదపడవచ్చని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-పెంబి

మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు భూమాగౌడ్ తల్లి, తలారి శేఖర్ చిన్నమ్మ ఇటీవల మరణించారు. కాగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జాన్సన్ నాయక్ వారి నివాసానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, కార్యకర్తలు ఉన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నవతెలంగాణ-తాంసి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని హస్నాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హస్నాపూర్ గ్రామ సమీపంలోని అంతర్ రాష్ట్ర రహదారిపై ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు వెళుతున్న ద్విచక్రవాహనం కారును ఢీకొనడంతో ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నట్టు ఎస్సై రాధిక తెలిపారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు


బేల

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ యువ నాయకుడు సతీష్ పవార్ మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర సాధన కోసం ఎంతో కృషి చేశారనీ అన్నారు. గత పది సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఎంతో పాటు పడ్డారని అన్నారు. గ్రామీణ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన కేసీఆర్ నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో కలకాలం జీవించాలనీ ఆ దేవున్ని వేడుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంభీర్ ఠాక్రే, దేవన్న, జక్కుల మధుకర్, మస్కే తేజరావ్, ప్రకాష్ పవార్, ఆకాశ్ గుండావార్, ఖోడే విపిన్, దయాకర్, బత్తుల సుదర్శన్, సుధాకర్, కొడపే అరుణ్ పాల్గొన్నారు.

ఉట్నూర్ : ఉట్నూర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం మాజీ సీఎం చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు ఒక్కరికొకరు మిఠాయిలు తినిపించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంద్ర జైవంతరావు, ఖలీమ్, ప్రభాకర్, భారత్ చవాన్, రవీందర్ పాల్గొన్నారు.

నేరడిగొండ : తెలంగాణ రాష్ట్ర సాధకులు, బంగారు తెలంగాణ నిర్మాత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ జన్మదిన సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసం వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కేసీఆర్ మీద అభిమానంతో రక్తదానం చేయడానికి నాయకులు, వికలాంగులు, అభిమానులు, రైతులు భారీ ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 14 నెలల పాలనతో ప్రజలు విసుగు చెంది, కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం కేసీఆర్ బర్త్ డేను పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం వృక్షార్చనలో భాగంగా ప్రతి కార్యకర్తకు మూడు మొక్కలను అందించి, నాటమని సూచించారు. అక్కడి నుంచి గంగపుత్ర శివాలయంలో కేసీఆర్‌పై అర్చన చేసి అభిషేకం, పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొని వడ్డించారు. రిమ్స్‌లో కేసీఆర్ బర్త్ డే సందర్భంగా రోగులకు పండ్లను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు రోగులను పరామర్శించి, ఆరోగ్య విషయాలు తెలుసుకుంటూ పండ్లను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అలాల్ అజయ్, పవన్ నాయక్, యూనీస్‌అక్బానీ, సాజిదొద్దిన్, దాసరి రమేష్, మెట్టు ప్రహ్లాద్, ప్రేమల, స్వరూప, మమత పాల్గొన్నారు.

నార్నూర్ : తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని నాగల్‌కొండ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ గ్రామ యువ నాయకుడు రాథోడ్ జితేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో కేసీఆర్ అలుపెరగని ఉద్యమాలు చేశారని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో ప్రదాత అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ పాషా, షేక్ మునీర్, నాగోరావ్, ముకుంద్, రాజు, రోహిదాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముధోల్ : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ సీఎం చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా సోమవారం బీఆర్ఎస్ నాయకులు రోగులకు పండ్లను పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు గంగాధర్, లతీఫ్, కన్నోళ్ల అంజయ్య, పెండెల లక్ష్మణ్, పోతుగంటి లక్ష్మణ్, మరిబా, గంగాధర్ పాల్గొన్నారు.


ఆదిలాబాద్‌టౌన్


ముధోల్

పాఠశాలలకు ప్రత్యేకాధికారుల నియామకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మండలాల వారీగా పాఠశాలలకు ప్రత్యేక అధికారులను నియమించినట్టు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు, మెనూ ప్రకారం భోజనం, స్నాక్స్, ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులపై దృష్టి సారించాలని, విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థుల కోసం రూపొందించిన అభ్యాస దీపికలు, తెలుగు, హిందీ, ఇంగ్లీషు, లాంగ్వేజ్‌లకు సంబంధించిన సబ్జెక్ట్ టీచర్‌లకు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. అభ్యాస దీపికలపై పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి రోజు ప్రత్యేక తరగతులకు హాజరై విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు చేయాలనీ, గంటపాటు విద్యార్థులతో స్పెండ్ చేసి సబ్జెక్టులపై నివృత్తి చేయాలన్నారు. అనంతరం జన్‌మన్ యోజన పథకం కింద చేపడుతున్న అంగన్‌వాడీ భవనాలు, కొత్త అంగన్‌వాడీ భవనాలు మంజూరైన వాటి నివేదికలు త్వరగా పంపాలని డీడబ్ల్యూఓను ఆదేశించారు.

బాధితుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

బాధితుల సమస్యల పట్ల విచారణ చేపట్టి పరిష్కరించాలని ఎస్పీ జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఏడుగురు అర్జీదారులు తమ సమస్యలను ఎస్పీకి వివరించారు. వెంటనే సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని సమస్యలు పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తుందని తెలియజేశారు.

సమతా కుంభ్‌లో చిన్నారి ఐరారెడ్డి ప్రతిభ



నవతెలంగాణ-సారంగాపూర్

శ్రీరామానుజాచార్య తృతీయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముచింతల్‌లోని సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో ఆదివారం జరిగిన మహానాట్య బృందం 4 రికార్డ్స్ నమోదు చేసింది. సమతా మూర్తి స్ఫూర్తి ఘంటసాల పవన్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాల నుంచి వచ్చిన 3 వేల మంది చిన్నారులు వివిధ నృత్య రూపాలతో చేశారు. ఇండియన్ వరల్డ్ రికార్డు, వండర్ బుక్ అఫ్ రికార్డ్స్, నృత్య గోల్డెన్ స్టార్ రికార్డు, జీనియస్ బుక్ అఫ్ రికార్డ్స్ వంటి నాలుగు రికార్డులను అందజేశారు. అందులో భాగంగా మండలంలోని బోరిగామ్ గ్రామానికి చెందిన బెజ్జంకి లక్ష్మీ ముత్యంరెడ్డిల కుమార్తె చిన్నారి ఐరారెడ్డి నృత్యంలో ప్రతిభ కనబరిచింది. చిన్నారికి త్రిదండి చిన్న జీయర్ స్వామి గోల్డెన్ స్టార్ రివార్డ్‌ను అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారిని పలువురు మండలవాసులు అభినందించారు.

20న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-తాంసి

ప్రజలకు ఇచ్చిన హామీలను, వాగ్దానాలను, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, 6 గ్యారంటీలతో పాటు ఏడవ హామీ ప్రజాస్వామిక హక్కులను పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తూ, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమొక్రసీ ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం భీంపూర్ మండల కేంద్రంలో అందుకు సంబంధించిన పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మడావి గణేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 2023 ఎన్నికల మేనిఫెస్టో ఇచ్చిన హామీలల్లో ఆరు గ్యారంటీలతో పాటు మొత్తం 420 హామీలను ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్న ఇందులో ఒకటి అర వాగ్దానాలు తప్ప అత్యధికం అలాగే ఉన్నాయన్నారు. రైతులకు చేస్తానన్న రుణమాఫీ ఇంకా సగానికి సగం అమలు కాలేదన్నారు. రైతుబంధు ఎకరాకు రూ.15వేలు ఇస్తానని రూ.12వేలు మాత్రమే ప్రకటించారన్నారు. పభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా నాయకులు గౌరాల సుభాష్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు మెస్రం మారుతి, పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి దత్తు, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు స్వప్నిల్, అమోల్, సోమేష్, పీవైఎల్ జిల్లా నాయకులు,రాజు, పృథ్వి, అఖిల్, అరవింద్, మెస్రం మారుతి, పీవైఎల్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ పల్లకి శోభాయాత్ర



నవతెలంగాణ-నార్నూర్

సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని పురస్కరించుకుని సోమవారం మండలంలోని తాడిహత్నూర్‌లో ఆలయ కమిటీ సభ్యులు పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మహిళలు సంస్కృతి, సాంప్రదాయ నృత్యాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మెన్ ధారావత్ ప్రవీణ్ నాయక్ పల్లకి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొని, పూజలు చేశారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న రామారావ్ మహారాజ్ విగ్రహానికి తనవంతుగా విరాళం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాథోడ్ గజానంద్ నాయక్, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ జాదవ్, ఉపసర్పంచ్ విష్ణు, గ్రామ సేవాలాల్ ఎంప్లాయిస్ యూత్ సభ్యులు చౌహాన్ కిషోర్, జాదవ్ పరశురాం, చౌహాన్ పునిరాం, జాదవ్ ఆనంద్‌రావ్, రాథోడ్ గణేష్, గ్రామ పటేల్ దినేష్ రాథోడ్, నాయక్ రాథోడ్ తానాజీ, గ్రామ పెద్దలు, జాదవ్ విద్యారాణి ఉన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. గణితం సబ్జెక్టుకు సంబంధించి లెక్కలను విద్యార్థులచే చేయించారు. పరీక్షలు సమీపిస్తున్నందున ఉన్న సమయాన్ని సరిగ్గా వినియోగించుకుంటూ, పరీక్షలకు సిద్ధంకావాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. సిలబస్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకుంటూ ఒత్తిడి లేకుండా చదవాలన్నారు. విద్యార్థులందరూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పదిలో పదికి పది పాయింట్లు సాధించిన విద్యార్థులతో కలిసి భోజనం చేస్తానని విద్యార్థులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. సబ్జెక్టుల్లో ఎటువంటి సందేహాలు ఉన్నా ఆయా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్, అదనపు కలెక్టర్ మధ్యాహ్న భోజనం చేశారు. ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఈఓ పి.రామారావు, కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీఓ సురేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేనొచ్చాక కూడా అధికారులు రారా?: కలెక్టర్

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణిలో చాలా మంది అధికారులు తాను వచ్చిన తరువాత కూడా రావడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలుంటాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొన్నారు. అర్జీలను స్వీకరించిన కలెక్టర్ సంబంధిత డీఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ అక్కడ లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఏఓ రాంరెడ్డికి వారికి ఫోన్ చేసి పిలిపించాలన్నారు. కలెక్టర్ వచ్చిన కూడా అధికారులు రాకపోవడం సరైన విధానం కాదన్నారు. తరువత గ్రీవెన్సు వచ్చిన అధికారులు వారికి సంబంధించిన అర్జీలపై కలెక్టర్‌కు వివరణ ఇచ్చారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం అర్జీల దారుల సమస్యలను విన్న కలెక్టర్ వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు అందించారు. కాగా సోమవారం నాటి ఫిర్యాదు విభాగంలో 69 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వినోద్ కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్య తీర్చండి సారూ..

చాలా సంవత్సరాల నుంచి నీటి సమస్యను ఎదుర్కొంటు, పోరాడుతున్నామని తమ నీటి సమస్యను ఇప్పుడైనా పరిష్కరించాలని నార్నూర్ మండలం సుంగాపూర్ గొండ్‌గూడ గ్రామస్తులు పెందూర్ లక్ష్మణ్, మెస్రం షేకు కోరారు. కిలోమీటర్లు నడిచి నీళ్లు తెచుకోవాల్సిన పరిస్థితి తమ గ్రామానికి ఉందన్నారు. ప్రతి కాలంలో తమకు ఈ సమస్య ఉందని ఇప్పుడు ఎండాకాలం ఈ సమస్య అధికమవుతుందని వాపోయారు. కరెంట్, పైప్‌లైన్, బావి మంజూరు చేయాలని కోరారు.

మా స్థలాన్ని కబ్జా చేశారు...

బోరజ్ మండలంలోని అకోలి గ్రామంలో తమ స్థలాన్ని ఓ కాంగ్రెస్ నాయకుడు అక్రమించాడని బాధితుడు సుభాష్ వాపోయారు. వేరే ఇంటి నెంబర్‌తో లాయర్ నోటీసులు పంపిస్తున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో కూడా తమ పేరే ఉందని తహసీల్దార్‌కు కూడా ఆ స్థలం తమదని తెలిపినట్టు పేర్కొన్నారు. దయచేసి తమ స్థలం తమకు ఇప్పించాలని మొర పెట్టుకున్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని బరోసానిచ్చారు.

పాఠశాల భవన నిర్మాణ చేపట్టండి

మావల మండలం దుబ్బగూడ గ్రామం దాజీనగర్‌లో నూతన పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని తల్లిదండ్రులు కోరారు. ప్రస్తుతం ఉన్న పాఠశాల రేకుల షెడ్డుతో, తడకలతో ఉందని తెలిపారు. వర్షాకాలంలో ఇబ్బందులు అవుతున్నాయని ఇప్పుడు ఎండా కాలంలోను వేడి ఉంటుందన్నారు. ఇదివరకు డీఈఓకు సెక్టోరల్ అధికారులకు ప్రతిపాదనలు పంపమన్నారు. మున్సిపల్ ఇంజినీర్ ద్వారా ప్లాన్ వేసి కలెక్టర్‌కు పంపించామని వారు చెబుతున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ భవన నిర్మాణానికి కృషి చేసి పిల్లల చదువుకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు.



అక్రమ డిప్యూటేషన్ రద్దు చేయాలి

జిల్లా అధికారులు పని చేయని ఉద్యోగులను కాపాడుతున్నారని ప్రజలకు సేవలందించడంపై దృష్టి పెట్టాలని, అక్రమ డిప్యూటేషన్ లను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్ పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ రిమ్స్ మలేరియా ల్యాబ్‌లో రెండు టెక్నీషియన్ పోస్టులు ఉంటే ముగ్గరికి డిప్యుటేషన్ ఇచ్చారని ఆరోపించారు. ఇలా అక్రమ డిప్యుటేషన్‌లు ఇస్తూ మండల స్థాయి ప్రజలకు వైద్య సేవలు అందకుండా ఉద్యోగులకు వత్తాసు పలుకుతున్నారని పేర్కొన్నారు. అన్ని మండలాల ప్రజలకు సేవాలందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

రైతు భరోసా వచ్చేలా చూడాలి

తమకు రైతు భరోసా ఇప్పటివరకు రాలేదని, బేల మండలంలోని సైద్‌పూర్ గ్రామస్తులు వాపోయారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు ప్రజావాణికి వచ్చి కలెక్టర్‌కు తమ గోడును విన్నవించారు. ఒకటి, రెండు ఎకరాలు ఉన్న చాలా మంది రైతులకు రైతు భరోసా రాలేదని వాపోయారు. అధికారులకు విన్నవించిన సమస్య పరిష్కారం కావడం లేదని వాపోయారు. కలెక్టర్ స్పందించి తమకు రైతుభరోసా వచ్చేలా చూడాలని కోరారు.



నవతెలంగాణ
నమ్మిక తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 18, 2025 | www.navatelangana.com

పదో తరగతి అంతర్గత మార్కుల పరిశీలన

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండలంలోని బాబాపూర్ గిరిజన ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలాలో పదవ తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలించిన టీం లీడర్ పీజీహెచ్ఎం వి.వరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం ముందస్తు జరగబోయే పదవ తరగతి పరీక్షలపై విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యాయుల రామచందర్, శ్యామ్‌రావు పాఠశాల ఉపాధ్యాయులు అల్లం అశోక్ కుమార్ పాల్గొన్నారు.

నేడు పేపర్ లెస్ శిక్షణ

నవతెలంగాణ-రెబ్బెన

పర్యావరణహిత చర్యల్లో భాగంగా సింగరేణి సంస్థ త్వరలో కాగిత రహిత సేవలకు శ్రీకారం చుడుతోందని బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జీఎం కె రాజమల్లు అన్నారు. సోమవారం ఎంవీటీసీ గనుల వృత్తి శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. మంగళవారం ఎంవీటీసీ ఆవరణలో కాగితపు రహిత సేవలు (సాప్ ఫైల్ లైఫ్ సైకిల్)పై బెల్లంపల్లి ఏరియాలోని అధికారులకు ఒక్క రోజు శిక్షణ ఇవ్వనున్నారు. అందులో భాగంగా వసతులను పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. సంస్థలో జరిగే అన్ని పనుల వివరాలు ఆన్‌లైన్ చేయ డానికి ఒక ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సిద్ధం చేస్తున్నారని చెప్పారు. అనంతరం గోలేటిలోని డిస్పెంసరిని పరిశీలించారు. ఈ కార్యక్రమమలో డీజీఎంఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహెర, ఎంవీటీసీ మేనేజర్ విజయ్ సింగ్ ఇందా, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ఐటీ ఇన్‌చార్జి ముజీబ్, ఎం రమేష్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహిస్తున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ చాంద్ పాషా పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక బస్టాండ్ ప్రాంతంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు, 420 హామీలు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 420 రోజులు గడుస్తున్నప్పటికీ హామీలు నెరవెర్చలేదన్నారు. రైతు భరోసా ఎకరాకు రూ.15వేలు, మహాలక్ష్మి పథకం క్రింద మహిళలకు నెలకు రూ.2500, వృద్ధాప్య పింఛన్ రూ.4 వేలు, నిరుద్యోగ భృతి, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు, కల్యాణ లక్ష్మి కింద రూ.లక్షతో పాటు తులం బంగారం వంటి అనేక పథకాల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ హామీల అమలు కోసం పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న చలో హైదరాబాద్‌లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జరప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ రత్నం పోషన్న, ఆత్రం రాజన్న, ప్రవీణ్, పోశయ్య, నాని, ఖాసీం పాల్గొన్నారు.

సమయం చాలా విలువైనది

- చాన్స్ క్లబ్ అధ్యక్షురాలు చెంచులక్ష్మి

నవతెలంగాణ-కౌటాల



సమయం చాలా విలువైనదని చాన్స్ క్లబ్ అధ్యక్షురాలు చెంచులక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని మొగడ్ దగడ్ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి తమ భవిష్యత్తును బాగుపరచుకోవాలని ఆమె సూచించారు. 25 సంవత్సరాలు కష్టపడితే 75 సంవత్సరాలు సంతోషంగా జీవితాన్ని గడపవచ్చని ఆమె సూచించారు. పదవ తరగతి వార్షిక పరీక్షలకు ఇక మిగిలింది 33 రోజులేనని వీటిని ఒక్క క్షణం కూడా వృథా పోకుండా కష్టపడి చదవాలని వారికి సూచించింది. మంచి మార్కులు తీసుకువస్తే తల్లిదండ్రులు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయులు ఎంతగానో సంతోషిస్తారని ఆమె అన్నారు. రోజువారి పరీక్షలలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థి చరణ్‌కుమార్‌కు సీల్డ్ అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ క్లబ్ సభ్యులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్ పట్ల విద్యార్థుల్లో మక్కువ పెంచడం లక్ష్యం

- జిల్లా సైన్స్ అధికారి మధుకర్

నవతెలంగాణ-కెరమెరి

విజ్ఞాన శాస్త్రం పట్ల విద్యార్థుల్లో మక్కువ పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ తెలిపారు. మండలంలోని మోడీ కేజీబీవీ పాఠశాలలో బస్సు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంచార సైన్స్ ప్రయోగశాల పరికరాలతో విద్యార్థులకు వాటి అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ పట్ల విద్యార్థులు సరైన దృక్పథం కలిగి ఉండాలన్నారు. సైన్స్ ప్రయోగశాల ద్వారా వివిధ రకాల అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మానవుని శరీర పనితీరు వాటి ఉపయోగం లాంటివి సులభంగా విద్యార్థులకు తెలియడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడంతో పాటు నిత్యజీవితంలో వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారిని ప్రవీణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉపాధ్యాయుల నియామకం

నవతెలంగాణ-సిర్పూర్(టీ)

2008 డీఎస్సీలో అర్హత సాధించిన ముగ్గురు మహిళ ఉపాధ్యాయులకు కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించిన నియమాక పత్రం అందించినట్లు మండల విద్యాధికారి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సోలాగూడకు ప్రతిమరాణి, గోవింద్‌పూర్ సరిత, భూపాలపట్నం సుమలత గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలల్లో వీరిని రూ.100 బాండ్ పేపర్ ఒప్పందం పై నియమించినట్లు తెలిపారు.

కౌటాల ఏఈగా అంజల్ కుమార్

నవతెలంగాణ-కౌటాల

కౌటాల ఏఈగా అంజల్ కుమార్ సోమవారం బాధ్యతలు తీసుకున్నట్లు ఏడీఈ రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన వాంఖడే ప్రేమ్ కుమార్ బదిలీపై ఆసిఫాబాద్‌కు వెళ్లగా బెజ్జూరు ఏఈగా పనిచేస్తూ కౌటాల ఏఈగా అదనపు పూర్తి బాధ్యతలను అంజల్ కుమార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-కౌటాల

కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం కౌటాల మండలంలోని భాలేపల్లి గ్రామంలో కోనేరు చారిటిబుల్ ట్రస్ట్ క్రికెట్ టోర్నమెంట్ మాజీ జెడ్పీటీసీ డోంగ్రి అనూష మధూకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అదే వసంతరావు, మాజీ సర్పంచ్ జాడే కుషాబ్ రావ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని కేశవనాతస్వామి ఆలయ వార్షికోత్సవాలు మంగళ, బుధవారంల్లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వాహణాధికారి గర్రెపల్లి వేణుగోపాల్ గుప్తా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు ప్రారంభమై మధ్యాహ్నం హోమం బలి ప్రధానం తర్వాత తీర్థ ప్రసాదం అందించడం జరుగుతుందని, రేపు 10:30 కు స్వామివారి కళ్యాణం తర్వాత, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

తెలంగాణ స్ఫూర్తి ప్రదాత కేసీఆర్

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ స్ఫూర్తి ప్రదాత మాజీ సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన కేసీఆర్ 71వ జన్మదిన వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశానికి తెలంగాణ శక్తి చూపెట్టిన గొప్ప నాయకుడు కేసీఆర్ అన్నారు. ఆయన పట్టుదల వల్లనే తెలంగాణ కళ సాకారమైందన్నారు. దేశ చిత్రపటంలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన నాయకుడని అన్నారు. పదేండ్లలో ఆయన చేసిన అభివృద్ధిని యేడాదిలోనే కాంగ్రెస్ గంగలో కలిపిందన్నారు. ఇందులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, యువ నాయకుడు కోవ సాయినాథ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, జిల్లా నాయకులు గంధం శ్రీనివాస్, భీమేష్, శ్రీనివాస్, అహ్మద్, నిసార్, కెరమెరి మండల నాయకుడు కలాం పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 71వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఇందులో మాజీ సర్పంచ్ అయూబ్, యువజన అధ్యక్షుడు ఎంగలి రాకేష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ వినోద్, ప్రవీన్, కోఆప్షన్ సభ్యుడు అహ్మద్, రియాజ్, అజ్జు, గులాబ్, యువ నాయకులు సంతోష్, యోగదీష్ పాల్గొన్నారు.

నోటు బుక్కులు పంపిణీ..

పెంచికల్ పేట్ : కేసీఆర్ జన్మదిన సందర్భంగా మండల కేంద్రంలోని ఎలుకపెల్లి ప్రాథమిక పాఠశాలలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బిట్టు శ్రీనివాస్ సోమవారం విద్యార్థులకు నోటుబుక్కులు, పెన్నులు, స్వీట్లు, అరటి పండ్లను అందజేశారు. ఇందులో బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు బండి మహేష్, నాయకులు రామిల దేవాజి, సతీష్, గోపాల్, యాదవ్, సాయి పాల్గొన్నారు.

కెరమెరి : రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎంపీపీ పెందూర్ మోతిరాం కేట్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడి రాష్ట్రం సాధించారన్నారు. ప్రాంత అభివృద్ధి, అన్నివర్గాలకు సమన్యాయం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇందులో మాజీ ఎంపీటీసీలు ఇఫ్తేకార్ హైమద్, గోగర్ల రాజయ్య, సీనియర్ నాయకులు ఇనూస్, మున్న, రాంచందర్ పాల్గొన్నారు.

రెబ్బెన : టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఏరియా గోలేటిటౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో సోమవారం కేసీఆర్ జన్మదిన వేడుకలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు కేసీఆర్ ఎన్నో హక్కులు అందించడం జరిగిందన్నారు. కార్మికులు ఎప్పుడు కూడా కేసీఆర్‌ను తమ గుండెల్లో నిలుపుకుంటారన్నారు. ఇందులో టీబీజీకేఎస్ ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, సెంట్రల్ కమిటీ నాయకులు ఓరం కిరణ్ మాంతు సమ్మయ్య ఫిట్ కార్యదర్శి కైరిగూడ బొంగు వెంకటేష్ అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి చందర్ నాయకులు సంపతి తిరుపతి దుంపల బాపు సాగర్ రమేష్ దేవేందర్ అనీష్ రెడ్డి సంజీవ్ అజీమ్ మారుతి తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన : మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. రైతులకు, పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చి అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇందులో రెబ్బెన మాజీ ఎంపీపీ జుండి సౌందర్య, నాయకులు సంఘం శ్రీనివాస్, బొమ్మినేని అహల్య దేవి, రంగు మహేష్, పందిళ్ల మధుమయ్య, మన్యం, పద్మ కుందార, శంకరమ్మ జిమ్మి ఆనంద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


సిర్పూర్(టి) : స్వరాష్ట్ర సాధనలో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర ఎంతో ఉందని, అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని సాధనకు కృషి చేశారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అస్లాంబిన్ అబ్దుల్లా అన్నారు. సోమవారం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని భవిత దివ్యాంగుల పాఠశాలలో, ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కోర్డినేటర్ మంగీలాల్, సీనియర్ నాయకులు షైక్ చంద్, కో కన్వీనర్ లక్ష్మణ్, పట్టణ అధ్యక్షుడు నందజీ, మండల యువజన అధ్యక్షుడు రవి వర్మ, నాయకులు షేక్ సల్మాన్, భరత్, అరవింద్, విలాస్, గౌతమ్, సునీల్, అజ్మీరా ప్రకాష్, సంతోష్, నగేష్, షారుఖ్, మొగిలి, శ్రీశైలం పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్



కెరమెరి



ధనస్వామ్య రాజకీయాలను ఓడిద్దాం

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి



నవతెలంగాణ-దహెగాం

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై స్పష్టమైన అవగాహన, అనుభవం కలిగిన నాయకుడు వై అశోక్ కుమార్‌ను రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై, అధ్యాపకులపై ఉందని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి ఉద్యమాలతో సంబంధం లేని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ప్రయివేటు విద్యాసంస్థల యజమానులు డబ్బులు పంచి ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవాలని చూస్తున్నారన్నారు. వీరి పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తతతో ఉండాలన్నారు. సీపీఎస్ రద్దు చేయించి ఓపిఎస్ పునరుద్ధరణ, 317 జీఓ సమస్య పరిష్కారానికి కృషి, కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనాలతో పాటు కనీస వేతన అమలు, పెండింగ్‌లో ఉన్న రూ.4 వేల కోట్ల బకాయిలు, పదవి విరమణ పొందిన వారికి పెన్షన్, బెన్ ఫిట్స్‌తో పీఆర్సీ ఇప్పించడం కృషి చేసే, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై అవగాహన కలిగిన అశోక్ కుమార్‌కు ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఉపాద్యాయులకు, అధ్యాపకులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి ముందుంటారని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇందులో జిల్లా కార్యదర్శి మహిపాల్, జిల్లా కమిటీ సభ్యులు హరీష్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా భరోసా సెంటర్ వార్షికోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలో వివిధ రకాల వ్యక్తులతో మోసపోయిన బాధితురాళ్లకు అండగా ఉండేందుకు జిల్లాలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్ ప్రారంభమై సంవత్సరం అయిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని భరోసా సెంటర్‌లో డీసీఆర్బీ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ లైంగిక దాడికి గురైన మహిళలకు, బాలికలకు అండగా భరోసా సిబ్బంది పని చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు భరోసా సెంటర్‌కు 28 కేసులు రాగా అందులో 20 పోక్సో చట్టం కింద నమోదైయ్యాయని తెలిపారు. 8 రేప్ కేసులు రావడం జరిగిందన్నారు. వివిధ పాఠశాలలలో 14 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నమోదైన 20 మంది బాధితురాల ఇండ్లకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి, ఆర్థిక పరిస్థితి తెలుసుకున్నట్టు తెలిపారు. భరోసా సెంటర్ ద్వారా పోలీస్ సేవలు, కౌన్సిలింగ్, వైద్య న్యాయ సేవలు అందించడం జరుగుతుందని, జిల్లాలోని షీ టీం సహకారంతో అవగాహన కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. ఎవరైనా బాధితులు ఉన్నట్లయితే 8712670561 నెంబర్ ద్వారా భరోసా కేంద్రాన్ని సంప్రదించగలరన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ బుద్ధ రవీందర్, భరోసా సిబ్బంది ఎస్ఐ తిరుమల, లీగల్ అడ్వైసర్ శైలజ, ఎఎన్ఎం విజయలక్ష్మీ, రిసిప్షనిస్ట్ సుమలత, బీడబ్ల్యుఓ, డీసీపీఓ మహేశ్, సఖి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాపంపిణీ వ్యవస్థ గాడితప్పితే కఠిన చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారితో కలిసి ఎన్ఫోర్స్‌మెంట్ డీటీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ కార్యకలాపాలను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనడం, అమ్మడం చేసిన వారిపై పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్-2016 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.. ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యాన్ని అందిస్తోందని, రేషన్ కార్డు దారులు ఈ బియ్యాన్ని కుటుంబ అవసరాల కోసం వినియోగించాలని, విక్రయించకూడదని తెలిపారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమంగా కొనుగోలు, విక్రయించినట్లు గుర్తించినట్లయితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, వారి రేషన్ కార్డు తొలగించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్‌తో ఆగిపోయిన బాల్య వివాహం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రెబ్బెన మండలం వంకులం గ్రామంలో బాలికకు ఆసిఫాబాద్ పట్టణం రాజంపేటకు చెందిన అబ్బాయితో వివాహం చేయబోతున్న వారిని జిల్లా అధికారులు అడ్డుకొని అమ్మాయిని స్థానిక సఖి కేంద్రానికి తరలించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేష్ బాలికతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ బాలికకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. దీనికి రెండు సంవత్సరాల కారాగార శిక్ష పడే అవకాశం ఉంటుందని వివరించారు. దీనితోపాటు రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందని వివరించారు. బాల్యవివాహాల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని తల్లిదండ్రులు అటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయకూడదని సూచించారు. ఎక్కడైనా బాల్యవివాహాలు చేస్తే 1098కు ఫోన్ చేసి సమాచారం అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ బాల ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్ చంద్రశేఖర్, రవళీ, జమున, సఖీ అడ్మిన్ మమత, సుమలత పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు ఇవ్వడం లేదా చికిత్స చేయడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి సీతారాం తెలిపారు. గతంలో పాఠశాల విద్యార్థులకు చేసిన కంటి పరీక్షల్లో అన్ని పాఠశాలలో లోపం ఉన్న వారిని 932 మందిని గుర్తించినట్లు వివరించారు. వీరందరికీ పరీక్షలు చేసి కంటి అద్దాలు లేదా శస్త్ర చికిత్స చేయిస్తామని తెలిపారు. మొదటి రోజు 98 మంది విద్యార్థులకు పరీక్షలు చేశామని, వీరిలో కొంతమందికి అద్దాలు అందించామని, మరి కొంతమందికి శస్త్ర చికిత్సకు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణురాలు డా.విశాల, ఆర్‌బీఎస్‌కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ నరేంద్ర, ఆప్టోమెట్రిస్ట్ జగన్ మోహన్, దినేష్ పాల్గొన్నారు.

వేలాలో జాతర ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-జైపూర్



గట్టుమల్లన్న దర్శనార్థం తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను సీఐ వేణుచందర్, ఎస్ఐ శ్రీధర్ ఏర్పాట్లను పరిశీలించారు. సోమవారం వేలాల ఘాట్ రోడ్డుతో పాటు ఆలయ ముఖ ద్వార పరిసరాల్లో కొనసాగుతున్న పనులను పర్యవేక్షించారు. ఘాట్ రోడ్డు విస్తరణలో భాగంగా ఉపరితలంతో గట్టుమల్లన్న ఆలయ ముఖ ద్వారం వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల క్యూలైన్ల ఏర్పాటును దృష్టిలో పెట్టుకుని రోడ్డుకు ఇరువైపులా చదును చేస్తున్నట్లు సీఐ వేణుచందర్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా స్థానిక ఎస్ఐ శ్రీధర్ పర్యవేక్షణలో నిరంతరాయంగా ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గుట్టపైకి వచ్చే భక్తుల రాకపోలకు ఇబ్బంది లేకుండా అదనంగా రోడ్డు నిర్మించడం జరుగుతుందని తెలిపారు.

ప్రమాదవశాత్తు గాయపడిన గీతా కార్మికుడు

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన గడ్డం సత్యగౌడ్ ప్రమాదవశాత్తు తాటి చెట్టు నుండి జారిపడి తీవ్రంగా గాయపడ్డట్లు గ్రామస్థులు తెలిపారు. యదావిధిగా సోమవారం తాటి చెట్లు ఎక్కుతున్న సత్యగౌడ్ కల్లు దించుతున్న సమయంలో మోకుతాడు జారడంతో ప్రమాదం జరిగింది. పరిసరాల్లో పని చేస్తున్న వారు ప్రమాదాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదంలో గాయపడిన సత్యగౌడ్‌ను 108 అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో సత్యగౌడ్ చెయ్యి విరిగిపోగా నడుముకు బలమైన గాయాలు కావడంతో శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు తెలిపారు.

ఆర్ఎంపీ, పీఎంపీల మహాసభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణ రాష్ట్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో నిర్వహించే ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయాలని జిల్లా సీనియర్ గ్రామీణ వైద్యులు సింగని వీరస్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలోని గ్రామీణ వైద్యులపై టీజీఎంసీ, ఎన్ఎంసీ, ఐఎంసీ డాక్టర్ల ఆధ్వర్యంలో దాడులు, అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 428, 429 జీవోల ద్వారా (పారామెడికల్) ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ అవసరమని గుర్తించారని తెలిపారు. 2009 అక్టోబర్ 1వ తేదీ నుండి 2012ఏప్రిల్ 1 వరకు ప్రభుత్వ డాక్టర్ల ఆధ్వర్యంలో డాక్టర్లచే వెయ్యి గంటల ట్రెనింగ్ ఇప్పించి 104,108లో సేవలను ఉపయోగించుకుందని పేర్కొన్నారు. సీఎం ప్రమాదవశాత్తు మరణించడంతో సర్టిఫికెట్స్ ఇవ్వడం ఆగిపోయాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఎంపి, పీఎంపీలకు సర్టిఫికెట్లు ఇచ్చి ప్రాథమిక కేంద్రాలు నడుపుకునే విధంగా అవకాశం కల్పించాలని కోరారు.

'తెలంగాణ స్ఫూర్తి ప్రదాత కేసీఆర్'

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజారాంరెడ్డి



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ స్ఫూర్తి ప్రదాత కారణజన్ముడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి అన్నారు. సోమవారం కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం మందపల్లి అనాథాశ్రమంలో, చిన్నారులకు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, జిల్లా అధికార ప్రతినిధి సిటీ మల భరత్ కుమార్, మున్వర్ అలీ ఖాన్, జిల్లా నాయకులు ఫజల్ ఖాన్ జాడి గంగాధర్, మాజీ కోఆప్షన్ సభ్యులు అలీ ఖాన్, నాయకులు జక్కు భూమేష్, బాలసాని శ్రీనివాస్‌గౌడ్, బోర్లకుంట ప్రభుదాస్, నర్సాగౌడ్, కొండ కోరి ప్రభుదాస్ రాజు, గట్టు మహేష్, జంగం రవి, లెక్కల మల్లయ్య, పురుషోత్తం, రాకేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌ను ఓడించాలి

- ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ కార్పొరేట్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌కు ఓట్ల ద్వారా బుద్ధి చెప్పి ఓడించాలని గ్రాడ్యుయేట్స్, విద్యార్థి, నిరుద్యోగులకు మంచిర్యాల ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి కార్పొరేట్ విద్యా వ్యవస్థలను స్థాపించి మా ప్రాంత విద్యార్థుల వద్ద నుంచి లక్షల్లో ఫీజుల రూపంలో డబ్బులు దోచుకుంటూ వారి తల్లిదండ్రుల రక్తాన్ని జనగల్ల తాగుతూ, తన కార్పొరేట్ విద్య సంస్థల సామ్రాజ్యాన్ని పెంపొందించుకుంటున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారంలో తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అభివృద్ధి చేస్తానని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు జుమ్మిడి గోపాల్, బచ్చలి ప్రవీణ్, రేగుంట క్రాంతి కుమార్, పూరెల్ల నితీష్, కె సమ్మయ్య, వి శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రభుత్వ పాఠశాలల్లో చదవుకునే విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత కంటి పరీక్షలు సోమవారం జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మార్చి 5వ తేదీ వరకు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ తెలిపారు. రోజుకు 80 నుండి 100 మంది పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహిస్తామని విద్యార్థులను ఆర్‌బీఎస్‌కే వాహనాల ద్వారా హాస్పిటల్‌కి తీసుకొస్తున్నమన్నారు. మొదటి విడుతలో 2024-ఏప్రిల్‌లో 164 గురుకులాల్లో 11,949 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశామన్నారు. ఇందులో 449 మంది విద్యార్థులకు కంటి సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. 2024-ఆగస్టులో నిర్వహించిన రెండో విడుతలో 568 ప్రభుత్వ పాఠశాలల్లో 24 వేల మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా, 694 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి రికార్డు చేశారన్నారు. సోమవారం 86 మందికి పరీక్షలు నిర్వహించామని అవసరం ఉన్న వారికీ ఉచితంగా కంటి అద్దాలు అందిస్తామని అత్యవసరం ఉన్న విద్యార్థులు ఇద్దరినీ శస్త్ర చికిత్సల కోసం రిఫర్ చేయడం జరిగిందన్నారు. డాక్టర్ యశ్వంతరావు. డాక్టర్ శిల్ప, చంద్రబాబు, ఆప్టిమెట్రిస్ట్ శంకర్, విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.

ప్రభుత్వంపై పత్తి రైతులు ఆగ్రహం

- కొనుగోళ్ల జాప్యానికి నిరసనగా రైతుల రస్తారోకో



నవతెలంగాణ-తాండూర్

పత్తి రైతులు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. పత్తి కొనుగోళ్ల జాప్యానికి నిరసనగా తాండూర్ మండలం రేపల్లెవాడ జిన్నింగ్ మిల్లుల వద్ద సోమవారం రైతులు రాస్తారోకో చేశారు. ఆధార్ అనుసంధానం కావడం లేదన్న సాకుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు వారు తెలిపారు. కొనుగోలు నిలిపివేయడంతో గత వారం రోజులుగా జిన్నింగ్ మిల్లుల ముందు పడిగాపులు కాయల్సి వచ్చిందని వాపోయారు. పత్తి లోడ్ చేసిన బండ్లకు వెయిటింగ్ చార్జీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యల కారణంగా గత వారం రోజులుగా కొనుగోళ్లను నిలిపివేయడంతో రోజుకు వెయ్యి చొప్పున వెయిటింగ్ చెల్లిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం పత్తి పంటకు మద్దతు ధర చెల్లించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రయివేటు వ్యాపారులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. వారం రోజులుగా సాంకేతిక సమస్యలు తలెత్తితే అధికారులు నాయకులు పట్టించుకోకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకో బెల్లంపల్లి నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. తాండూర్ మండలంలోని శ్రీరామ జిన్నింగు మిల్లు వద్ద మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్ ప్రధాన రహదారిపై బైఠాయించడంతో వాహనాల రాకపోగాలకు అంతరాయం ఏర్పడింది. తాండూర్ సీఐ కుమారస్వామి పరిస్థితులను శాంతింపజేశారు.

దుబ్బగూడెం రహదారిపై గ్రామస్తుల ఆందోళన



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దుబ్బగూడెం రహదారిపై గ్రామస్తులు రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపై బైటాయించి బెల్లంపల్లి మున్సిపాలిటీ చెత్తను దుబ్బగూడెం శివారులో వేయడం పట్ల అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. బెల్లంపల్లి మున్సిపాలిటీకి సంబంధించిన చెత్తను దుబ్బగూడం శివారులో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి చెత్తను వేయడం, కాల్చడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోజు వారీగా భారీ సంఖ్యలో వాహనాలల్లో గ్రామం మీదుగా చెత్తను తీసుకువెళ్తూ మా గ్రామ సమీపంలో వేయడం దారుణమన్నారు. బెల్లంపల్లి మున్సిపాలీటీకి సంబంధించి ఆ పరిధి స్థలాల్లో చెత్తను వేయకుండా తీసుకొచ్చి దుబ్బగూడెం శివారులో వేయడం ఏంటని ప్రశ్నించారు. ఇంత భారీగా చెత్తను వేయడం వల్ల స్థానికులకు అనేక రోగాలు వస్తాయని మండి పడ్డారు. ఇక్కడ అనుమతులు ఇవ్వడం సరైంది కాదని, వెంటనే ఈ చర్యలు మానుకోవాలి డిమాండ్ చేశారు. ధర్నాతో రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామస్తులకు నచ్చజెప్పారు. బెల్లంపల్లి మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో మున్సిపల్ కమీషనర్‌తో ఫోన్‌లో మాట్లాడించడంతో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఇలాంటి సంఘటన పునరావతమైతే ఆందోళన ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. అనంతరం ట్రాఫిక్‌ను పోలీసులు క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గోనెల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సపాట్ శంకర్, దుర్గం గోపాల్, బోగె పోశం, సిలోజ్ మురళీ, కొయ్యాడ శ్రీనివాస్, సంతోష్, విజయ లక్ష్మీ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- ఎంపీడీఓకు వినతి పత్రం అందజేసిన పంచాయతీ కార్యదర్శులు



నవతెలంగాణ-జన్నారం

గ్రామపంచాయతీల్లో గత ఆగస్టు నెల నుంచి పెండింగ్‌లో ఉన్న చెక్కుల చెల్లింపులకు సంబందించిన నిధులను విడుదల చేయాలని మండల కార్యదర్శుల సంఘం నాయకులు కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఉమర్ షరీఫ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ మండల అధ్యక్షుడు లకావత్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో గత సంవత్సరం (ఫిబ్రవరి 22024) పాలకవర్గం కాల పరిమితి ముగిసిన నాటి నుండి గ్రామపంచాయతిలలో రోజువారి నిర్వహణ అయిన పారిశుద్ధ్య నిర్వహణకు కావలసిన ట్రాక్టర్ డీజిల్ మరమ్మత్తులు, బ్లీచింగ్, బయోటెక్స్, ఫాగింగ్ దోమల మందులు, ఇతర పారిశుధ్య సామగ్రిని, అదే విధంగా వీధి దీపాల నిర్వహణ, తాగు నీటి నిర్వహణకు వెండర్ల నుండి మా భాధ్యతగా క్రెడిట్ తీసుకొచ్చి గ్రామపంచాయతీల నిర్వహణ సాగించామని తెలిపారు. వాటికి సంబందించిన బిల్లులను చెక్కుల రూపంలో వారికి చెల్లించడం జరిగినదన్నారు. చెక్కులు ఐటీఎంఎస్‌లో ఆగస్టు నుంచి పేమెంట్ కాకుండా ఎండింగ్‌లో ఉన్నాయన్నారు. గానిధులు అందుబాటులోలేని గ్రామపంచాయతిలలో ఖర్చు చేసిన డబ్బులు చెల్లించలేని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో గ్రామపంచాయతీ కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి పంచాయతీల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పీఆర్డీ జలంధర్ కార్యదర్శులు విశ్వ, మధుకర్ పాల్గొన్నారు.

మహిళలకు అండగా భరోసా కేంద్రాలు



నవతెలంగాణ-నస్పూర్

లైంగికదాడికి గురైన బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటి నుంచి కేసు ట్రయల్‌కు వచ్చే వరకూ, పరిహారం ఇప్పించేవరకూ భరోసా కేంద్రాలు అండగా నిలుస్తుందని పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ అన్నారు. సీసీసీ నస్పూర్ పాత పోలీస్‌స్టేషన్ భవనంలో వున్న భరోసా సెంటర్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోక్సో చట్టం పరిధిలోకి వచ్చే కేసుల్లోని బాధిత మహిళలను అక్కున చేర్చుకుని వారికి వైద్యుడు, సైకాలజిస్టు, న్యాయాధికారి, పోలీసులు న్యాయ సహాయం చేయడం, ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పించడం వంటి సేవలతో బాధితులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో భరోసా కేంద్రం పని చేస్తుందని అన్నారు. బాధితులు రాగానే ఎవరి పరిధిలో వారు పనిచేస్తూ సత్వర న్యాయానికి కృషి చేస్తారని పెర్కొన్నారు. మంచిర్యాల జోన్‌లో ఎక్కడైనా పోక్సో, లైంగికదాడుల కేసులు నమోదు కాగానే బాధితులను నేరుగా భరోసా సెంటరుకు తీసుకొస్తున్నామన్నారు. తక్షణమే బాధితులకు సూచనలు, సలహాలు అందించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశిస్తున్నామని పేర్కొన్నారు. బాధితులకు న్యాయపరమైన సూచనలు అందించి, వారికి ఎవరూ లేనప్పుడు భరోసా సెంటర్‌లో ఆశ్రయం కల్పించాలన్నారు. వీటితో పాటు ఈ భరోసా సెంటర్లు బాధితులకు నైపుణ్యాలను నేర్పించి, వారిని సమాజంలో ఉన్నతంగా జీవించేలా దోహదపడుతుందన్నారు. అందుబాటులో వున్న లీగల్, మెడికల్, చిన్నారుల కౌన్సెలింగ్ గదులు, స్టేట్మెంట్ రికార్డు సమావేశ గదులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, మహిళ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ నరేష్ కుమార్, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ కుమార్, మంచిర్యాల షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ హైమ, సిసి హరీష్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య సేవలను ద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయంలోని డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో మంగళవారం ఆయుర్వేద వైద్య పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శ్రీరాంపూర్ డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వైద్య సేవలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతాయని తెలిపారు. దీర్ఘకాలిక రోగాలు బీపీ, షుగర్ లాంటి వ్యాధులు, కీళ్ల, నడుము నొప్పులు వంటి వాటికి పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

'నిరుపేదలకు ఇండ్ల స్థలాలివ్వాలి'



నవతెలంగాణ-జన్నారం

మండలంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లతో పాటు ఇంటి స్థలాలు ఇవ్వాలని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాందాస్ నాయక్, జిల్లా అధ్యక్షుడు దారింగుల ఎల్లయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట పేదలతో నిరసన తెలిపారు. మండలంలోని గాంధీనగర్‌లో ఉన్న సీలింగ్ భూమిలో అక్కడున్న పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలు అద్దె ఇండ్లలో ఉంటూ కిరాయి చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ సీలింగ్ భూములు నిరుపేదలకు పంచి అక్కడ ఇండ్లు నిర్మించి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు బోడ కిషన్, నర్సయ్య, గోపి, చంద్రయ్య, సిడం ధర్మ, కైలాస్, సంధ్య, సంభాజీ, వెంకటాద్రి పాల్గొన్నారు.

రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-తాండూర్

బోయపల్లి నుంచి బుగ్గ రాజేశ్వర స్వామి దేవాలయం వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం బుగ్గ రాజేశ్వరస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జక్కుల శ్వేతా శ్రీధర్ అన్నదాన ట్రస్ట్ చైర్మన్ మాసాడి శ్రీదేవి, సుంకరి చంద్రయ్య పాల్గొన్నారు.

కుటుంబ రీసర్వేని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

గతంలో ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేలో తప్పిపోయిన వారు కోసం రీసర్వే నిర్వహిస్తోందని, తమ పేరును నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమర్ షరీఫ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన, కుటుంబ రీసర్వే దరఖాస్తులను స్వీకరించారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన ఈ సర్వేలో ఇప్పటివరకు ఒకే ఒక దరఖాస్తు వచ్చిందని తెలిపారు. ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరలో అంతరాయం

నవతెలంగాణ-తాండూర్

మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈ రాజన్న తెలిపారు. 33 కేవీ శివాలయం, 33 కేవీ కన్నెపల్లి ఫీడర్లలో రైల్వే క్రాసింగ్ కేబుల్ మరమ్మత్తులు ఉండడం వలన బెల్లంపల్లి మండలంలో శివాలయం సబ్‌స్టేషన్ పరిదిలోని, భీమిని, కన్నెపల్లి మండలాలకు విద్యుత్తు సరఫరకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. నెన్నెల మండలములోని నెన్నెల సబ్‌స్టేషన్ పరిధిలోగల గ్రామాలకు, వేమనపల్లి మండలములోని లక్ష్మీపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోగల గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు అందరూ సహకరించగలరని కోరారు.

మైనింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో నెలకొన్న మైనింగ్ స్టాఫ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వర్‌రావు అన్నారు. సోమవారం ఆర్కే-7 గనిపై మైనింగ్ స్టాఫ్ సోదర, సోదరీమణులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో మైనింగ్ స్టాఫ్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి, పెండింగ్ సమస్యల గురించి చర్చించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యంగా 2016 బ్యాచ్ జేఎంఈటీల ప్రమోషన్లు, చార్జ్ అలవెన్స్, బంగ్లా కీప్ అప్ అలవెన్స్, ఓసీ కౌన్సిలింగ్‌లో పాల్గొన్న ఓవర్ మెన్‌లకు ఓసీ రిలీవింగ్‌లను ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ చెప్పి అపారని, ప్రమోషన్లు, రిలివింగ్ ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఇట్టి విషయాన్ని యాజమాన్య దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాప్ ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, బెల్లంపల్లి రీజియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అడ్డు శ్రీనివాస్, జీఎం చర్చల ప్రతినిధి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | ఫిబ్రవరి 18, 2025 | www.navatelangana.com

ఎమ్మెల్సీ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం తనిఖీ



నవతెలంగాణ-నిర్మల్

ఎమ్మెల్సీ ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిషోర్ కుమార్ సందర్శించారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో గల ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సోమవారం తనిఖీ చేసి సామాగ్రి భద్రతపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎన్నికల సామాగ్రిని అత్యంత జాగ్రత్తగా భద్రపరచాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు జిల్లాకు చేరుతున్న సామాగ్రి వివరాలను సంబంధిత రిజిస్టర్లలో జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. కార్యాలయంలో నిర్వహిస్తున్న పలు ఎన్నికల సామాగ్రి రిజిస్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నదిలో స్నానానికెళ్లి యువకుడు మృతి

నవతెలంగాణ -ముధోల్

బాసర గోదావరి నది మొదటి ఘాట్ వద్ద సోమవారం స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా ధర్మాబాద్ మండలం రత్పల్లి గ్రామానికి చెందిన పవార్ బాలాజీ(25) కుటుంబ సమేతంగా శుభకార్యానికి వచ్చాడు. నదిలో స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో నీట మునిగాడు. స్థానికుల సమాచారంతో నదిలో మృతదేహాన్ని వెలికితీసి కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు.



ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



తాండూర్‌లో..

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి బీఆర్ఎస్ కార్యలయంలో నిర్వహించిన వేడుకల్లో నియోజకవర్గంలోని నాయకులు పాల్గొని మొక్కలు నాటారు. స్థానిక కోదండ రామాలయంలో కేసీఆర్ పేరిట అర్చన చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, టౌన్ ప్రెసిడెంట్ నూనెటి సత్యనారాయణ, బీఆర్ఎస్వీ జిల్లా ప్రెసిడెంట్ బడికల శ్రావణ్, మాజీ ఎంపీపీ సుభాష్ రావు పాల్గొన్నారు.

నస్పూర్ : తెలంగాణ రాష్ట్ర మాజీ మాజీ సీఎం కేసీఆర్ 71వ జన్మదిన వేడుకలు టీబీజీకేఎస్ కార్యాలయంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెట్టెం లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొని చెట్లు నాటి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నాయకులు ఎండీ లాలా, గోన్ స్వామి, ఏరియా నాయకులు గొర్ల సంతోష్, బుడ్డి ప్రసాద్, మైన్ పిట్ కమిటీ నాయకులు వెంకటరెడ్డి, దుర్గం రవికుమార్, పాదం శ్రీనివాస్, జగదీష్, గోగర్ల గోపాల్, గోవిందుల రమేష్, జైపాల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గడ్డం సుధాకర్, దేవేందర్, మధు పాల్గొన్నారు.

కాసిపేట : మండలంలో అట్టహాసంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపు మేరకు వక్షార్చనలో భాగంగా కాసిపేట మండలంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. అనంతరం ఆస్పత్రిలో పండ్లను పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్ క్యాలెండర్‌ను విడుదల చేశారు. అనంతరం బీఆర్ఎస్ మండల అధ్యక్షుల్లు బొల్లు రమణ రెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య మాట్లాడుతూ హరిత ప్రేమికుడు కేసీఆర్ అని, హరితహారంతో తన పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని ఆకుపచ్చ తెలంగాణగా మార్చారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, బీఆర్ఎస్ కార్యదర్శి మోటూరి వేణు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటింకి వాల్దేవ్, మాజీ సర్పంచ్‌లు ఆడె బాదు, అజ్మీర తిరుపతి, మాజీ డైరెక్టర్ ఏనుగు మంజులారెడ్డి, లంక లక్ష్మణ్, జాడి రాంచందర్, కైలాస్, మచ్చ అశోక్, రంగు రమేశ్, గజానంద్, మచ్చ ఆనీల్, బాసవేణి కొమురయ్య పాల్గొన్నారు.



కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై కేసీఆర్ జన్మదిన వేడుకలు

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గనిపై టీబీజీకేఎస్ నాయకులు సారంగపాణి ఆధ్వర్యంలో తెలంగాణ జాతి పిత కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీ రిలే ఇన్‌చార్జి వెంకటేష్, డీ రిలే ఇన్‌చార్జి పోశం చేతుల మీదుగా కేక్ కట్ చేయించి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్ కుమార్, కల్లాలి రాజేష్, మురళీ. సత్య ప్రసాద్, శ్రావణ్, తిరుపతి, శ్రావణ్, కుమార్, అర్జున్, రవి, మసూద్, మహేష్, రమేష్, అజయ్, సందీప్, దేవేందర్, బాసు, ఆత్రం మహేష్ పాల్గొన్నారు.

జైపూర్ : బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గం నాయకులు డాక్టర్ రాజా రమేష్ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాలయంలో పార్టీ నాయకులతో కలిసి అర్చన చేయించడంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేయడమే కాకుండా నాయకులు, కాక్యకర్తలతో కలిసి రక్తదానం చేశారు. ఐబీ చౌరస్తా వద్దన గల దర్గాలో మైనార్టీ సోదరులతో కలిసి నూరేళ్ల జీవించాలని కోరుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద 71 కిలోల కేక్ కట్ చేసి అక్కడున్న వారందరికి స్వీట్లు పంపిణీ చేశారు. కొత్త బస్టాండ్‌లో సుమారుగా ఐదు వందల మందికి అన్నదానం చేశారు. జైపూర్ మండల కేంద్రంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉన్నదని నాయకులు పేర్కొన్నారు.



జైపూర్‌లో..



కాసిపేటలో..

ఆదాయపు పన్ను చెల్లింపు ప్రక్రియ సక్రమంగా నిర్వర్తించాలి

● మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



నవతెలంగాణ-నస్పూర్

జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్, మార్పుల ప్రక్రియలో భాగంగా సబ్-రిజిస్ట్రార్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయంలో జరిగే లావాదేవీలకు సంబంధించి వచ్చే ఆదాయానికి పన్ను చెల్లింపు ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీఓలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణ, ఐటి అధికారి సూర్యభగవాన్‌తో కలిసి సబ్-రిజిస్ట్రార్, మండలాల తహసీల్దార్లతో ఆదాయపు పన్ను చెల్లింపు, రికార్డుల నిర్వహణపై సమీక్షించారు. రిజిస్ట్రేషన్ సమయంలో రూ.10 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో లావాదేవీ జరిగే సమయంలో పాన్ కార్డు అందజేయని వారు ఫారం-60 జత చేయాలన్నారు. పాన్ కార్డ్ కలిగి ఉండి రూ.30 లక్షల కంటే ఎక్కువ మొత్తంలో లావాదేవీ జరిగిప్పుడు ఫారం-61(ఎ) ద్వారా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. కార్యాలయాలకు సంబంధించి ఐటి ఖాతా తెరిచేందుకు సంబంధిత కార్యాలయం టాన్ నంబర్, చిరునామా, ఈ-మెయిల్, కార్యాలయం తరపున అధికారిక వ్యక్తుల పాన్ కార్డు నఖలు ప్రతి జతపరచవలసి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల సబ్-రిజిస్ట్రార్ ప్రియాంక, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూట్ ఆఫీసర్లు, పోలీస్ అధికారులతో కలిసి అన్ని పోలింగ్ కేంద్రాలకు చేరుకునే దారి, దూరం, పోలింగ్ కేంద్రానికి చేరుకునేందుకు పట్టే సమయం తదితర అంశాలను పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్‌కాస్టింగ్ నిర్వహణకు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో దివ్యాంగ ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వీల్ చైర్, ర్యాంపు వంటి ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లాకు చేరుకున్న పోలింగ్ సామాగ్రికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ సిబ్బంది సామాగ్రి తరలింపునకు సంబంధించిన వాహనాలను సమకూర్చుకోవాలన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల కామన్ పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలను తీసుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బందికి మరోసారి శిక్షణ నిర్వహించి, నమూనా ఎన్నికను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్‌రెడ్డి, జెడ్పి సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారి ఎం.ఎ. రజాక్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఎంశ్రీ నిధులతో విద్యాసంస్థల్లో మౌలిక వసతులు సమకూర్చుకోవాలి

పీఎంశ్రీ ద్వారా కేటాయించిన నిధులతో విద్యాసంస్థలలో మౌలిక వసతులను సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో పీఎంశ్రీ నిధుల వినియోగంపై ఆమె సమీక్షించారు. జిల్లాలోని పాఠశాలలకు కేటాయించిన పిఎంశ్రీ నిధులు, ఇప్పటివరకు ఖర్చు చేసిన నిధులకు సంబంధించిన వివరాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో పలు ప్రత్యేక దినోత్సవాలు నిర్వహణకు ఈ నిధులను వినియోగించుకోవచ్చునని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచడానికి ఉపయోగపడే ప్రత్యేక పరికరాలు, ఉపకరణాలు, క్రీడా వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. ప్రత్యేక నిధులను పాఠశాలల్లో వసతుల నిర్వహణ, పచ్చదనం పెంపొందించడానికి ఖర్చు చేయాలన్నారు. నిధులను సక్రమంగా వినియోగించుకుంటూ పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డిఈఓ పి. రామారావు, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని వైకుంఠపూర్ గ్రామంలోని పురాతన ప్రభు స్వామి శివాలయం పునర్నిర్మాణ మందిరంలో సోమవారం ప్రధాన అర్చకులు ఆనంద్ ఆధ్వర్యంలో వేదపండితులు శ్రావణ్ కుమార్, రాజు, ప్రవీణ్ శర్మచే విగ్రహాలు మల్లికార్జున స్వామి, లక్ష్మీనరసింహ స్వామి, సంతాన లక్ష్మీదేవి, హనుమాన్ సహిత నవగ్రహాలు ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శని, ఆదివారాల్లో గణేష్, గౌరీ, దేవత మండప పూజ అష్టోత్తర కలశ పూజలు సోమవారం పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు, వీడీసీ ఆధ్వర్యంలో మహా అన్నదాన చేశారు. మండల వాసులతో పాటు చుట్టూ ప్రక్కల గ్రామాల భక్తులు వేలదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

విగ్రహాప్రతిష్టాపనలో ఎమ్మెల్యే

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని బుట్టాపూర్ గ్రామంలోని హనుమన్ ఆలయంలో సోమవారం నవగ్రహాల, ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజలలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమంతుడితో పాటు నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి కాంగ్రెస్ నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేష్, గుండ నరేష్, రమేష్‌రావు, రంజిత, రాజేశం, శ్రీనివాస్, కిషన్, అంజన్న, ప్రజ్యోతి రావు, ఆనంద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-నేరడిగొండ

కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ సమక్షంలో బీజేపీ నాయకులు ఏలేటి మనోజ్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆడే గజేందర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఏలేటి మనోజ్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. వచ్చే ఎన్నికలలో గెలిపే లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలిపారు. ఈ సంధ్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ యువ నాయకులకు కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందన్నారు. గత పది సంవత్సరాలుగా లేని అభివృద్ధిని కేవలం ఒక సంవత్సరంలోనే చేసి చూపిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్‌రావు, సీనియర్ నాయకులు ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, రాథోడ్ కమల్ సింగ్, కపిల్ దేవ్, రమేష్ యువ నాయకులు తొడసం శంకర్, ఎండి సద్దాం, లక్కాన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జాన్సన్ నాయక్ పరామర్శ



నవతెలంగాణ-కడెం

మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పులి నర్సాగౌడ్‌కు కాలు ఫ్యాక్చర్ అయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. సోమవారం బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్య జాన్సన్ నాయక్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో అంబారిపేట్ మాజీ సర్పంచ్ కొప్పుల లక్ష్మీలచ్చన్న, బీఆర్ఎస్ మాజీ గ్రామ అధ్యక్షులు బైరి రవి, నాయకులు పెరగని గణేష్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నవతెలంగాణ - హాజీపూర్

మండలంలోని కర్ణమామిడి గ్రామంలో సోమవారం పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం కర్ణమామిడి గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు స్థావరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నారు. వీరి వద్ద నుండి రూ.1630 నగదు, ప్లేకార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి యాటకారి సాయన్న ముదిరాజ్ ప్రచారం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని డిగ్రీ, జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న ఉపాధ్యాయులను కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి యాటకారి సాయన్న ముదిరాజ్ కలుసుకొని మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ టీచర్లతోపాటు కేజీబీవీ, మాడల్ స్కూల్, గురుకుల, ఇంటర్మీడియట్, డిగ్రీ లెక్చరర్లు, విశ్వద్యాలయ ప్రొఫెసర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎలాంటి షరతులు లేకుండా జీవన భృతి ఇవ్వాలి



నవతెలంగాణ-బోథ్

ఎలాంటి షరతులు లేకుండా బీడీ కార్మికులకు రూ.4,016 జీవన భృతి కల్పించాలని సోమవారం తెలంగాణ బహుళ జన బీడీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, తహసిల్దార్ సుభాష్ చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బహుళ జన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. సిద్ధి రాములు మాట్లాడుతూ ఎన్నికలలో బీడీ కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.4016 ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ కార్మికులకు ప్యాకర్లు, బట్టి, చటన్, టేకేదార్లకు 2014 ఫిబ్రవరి 28న కటాఫ్ తేదీని తొలగించి, ఎలాంటి షరతులు లేకుండా రూ.4016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన బీడీ కార్మికులకు ఇచ్చిన మాట నేటికి అమలు చేయలేదన్నారు. ఇప్పటికైన కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, బీఎల్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.జగదీష్, రాష్ట్ర కోషాధికారి ఎస్‌డీ సయ్యద్, నిర్మల్ జిల్లా కన్వీనర్ చట్ల పోసాని, నాయకులు శాంత పాల్గొన్నారు.

ఇసుక వేలం పాట

నవతెలంగాణ- నిర్మల్‌రూరల్

ఇటీవలి నిర్మల్ గ్రామీణ మండలం పరిధిలో వివిధ గ్రామాల్లో అక్రమంగా పట్టుబడ్డ 35 ట్రాక్టర్ల ఇసుక వేలం పాటను సోమవారం మంజులాపూర్ సమీపంలో అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో ఇద్దరు వ్యక్తులు పాల్గొన్నారు. రూ.64,700కు షేక్ ముబీన్ దక్కించుకున్నారు. ఈ వేలంపాటలో నిర్మల్ గ్రామీణ మండలం తహసీల్దార్ సంతోష్ కుమార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ విజయ్ కుమార్, నిర్మల్ గ్రామీణ ఎస్సై లింబాద్రి పాల్గొన్నారు.

దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలం వడూర్ గ్రామంలో రావుల ఇస్తారి ఇంట్లో దేశీదారు సీసాలను సీఐ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో ఎస్సై కలీం తన సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. 90 ఎంఎల్ బాటిల్స్-28, 180 ఎంఎల్ బాటిల్స్-12 మొత్తం 4.68 లీటర్ల దేశీదారు సీజ్ చేశారు. వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలనే డీఎస్పీ జీవన్‌రెడ్డి సూచనల మేరకు దాడులు చేశామని సీఐ పేర్కొన్నారు.